మార్మోగిన జగన్ నినాదం

సామాజిక సాధికార యాత్రకు వెల్లువలా తరలి వచ్చిన జనం



గాజువాక సభకు తరలివస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు



సామాజిక సాధికార యాత్ర సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

గాజువాక/ఉక్కునగరం/కూర్మన్నపాలెం: సామాజిక సాధికార యాత్రకు జనం వెల్లువలా తరలివచ్చారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో గాజువాకలో సోమవారం నిర్వహించిన సభలో పాల్గొనేందుకు వైఎస్సార్‌సీపీ నాయకుల సారథ్యంలో ప్రతీ వార్డు నుంచి ర్యాలీగా వచ్చారు. అన్నివర్గాలకు సమప్రాధాన్యం కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలికారు. జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది.

జనం గుండెల్లో సీఎం జగన్

దశాబ్దాల తరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గాజువాక ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించి రిజిస్ట్రేషన్లు చేయించడంతో, త్వరలోనే పట్టాలను పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యం కల్పిస్తున్న ఇటువంటి ముఖ్యమంత్రి పదికాలాల పాటు పరిపాలన సాగించేలా చూసుకోవడం మనందరి బాధ్యత అన్నారు.

యాత్ర గ్రాండ్ సక్సెస్

సామాజిక సాధికార యాత్ర గాజువాకలో సూపర్ సక్సెస్ కావడంతో క్యాడర్‌లో ఆనందం పెల్లుబికింది. సీఎం జగన్ నాయకత్వంపై జనానికున్న అభిమానం వారిలో ఉత్సాహాన్ని నింపింది.

తరలివచ్చిన జనసందోహం

- 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు ఆధ్వర్యంలో ఆటోల్లో జనం భారీగా తరలి వచ్చారు. నాయకులు ఉరుకూటి అప్పారావు, నీలాతి అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.
- సాధికార యాత్రలో పాల్గొనేందుకు 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సనత్‌నగర్ నుంచి వంటిల్లు జంక్షన్ మీదుగా సభా స్థలికి తరలి వచ్చారు.
- స్టీల్ వైఎస్సార్‌టీయూసీ శ్రేణులు ఉక్కునగరం కార్యాలయం నుంచి సభాస్థలికి ర్యాలీగా వెళ్లారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డి. సంపూర్ణం, కమల్ బాషా, నల్లమల్లి శ్రీనివాస రెడ్డి, డి.పుల్లారావు, ఎస్.చంద్రశేఖర్, టి.చంద్రశేఖర్, కె.ప్రకాశరావు, ఎం.నాగరాజు పాల్గొన్నారు.
- 87వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు బైక్‌లపై ర్యాలీగా వచ్చారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, సీహెచ్.వి.రమణ, కె.పారిపల్లి, వడ్లపూడి ఈశ్వరరావు, కోమటి రమాదేవి, ఆడారి శ్రీను, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, ప్రజలకు అభివాదం చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి



కార్పొరేటర్ చందుతో కలిసి 70వ వార్డు నుంచి ర్యాలీగా వస్తున్న ప్రజలు



73వ వార్డు నుంచి ర్యాలీగా వస్తున్న కార్పొరేటర్ భూపతిరాజు సుజాత

క్లుప్తంగా

రూ.1.25 కోట్ల ఆస్తి పన్ను వసూలు



జెడ్సీకి ఆస్తిపన్ను చెక్కును అందజేస్తున్న రెవెన్యూ విభాగం అధికారులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ విభాగం అధికారులు సోమవారం రూ.1,25,57,825 ఆస్తి పన్ను వసూలు చేశారు. 69వ వార్డులోని ఈఎస్ఐ ఆస్పత్రి చెల్లించాల్సిన మూడేళ్ల పన్నును అధికారులు ఒకేసారి వసూలు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్ఐలు సుభాన్, మోహన్, శివ జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని జెడ్సీ అభినందించారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు వినతి



వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా పరిరక్షించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కోరారు. సామాజిక సాధికార యాత్రలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన్ను టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 998 రోజులుగా కార్మిక సంఘాలు పోరాటాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు ఆదినారాయణ, వై.మస్తానప్ప, డీవీ రమణారెడ్డి, మార్పుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, గొందేశి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న స్టీల్‌క్లబ్ కార్యవర్గం ఎన్నికలు

ఉక్కునగరం: స్టీల్‌క్లబ్ కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 25న నిర్వహించనున్నారు. ప్రస్తుత కార్యవర్గం కాలపరిమితి ముగియడంతో నూతన కార్యవర్గం కోసం ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్టీల్‌ప్లాంట్ డీజీఎం జె.వి.రావు తెలిపారు. ఈ నెల 10 నుంచి నామినేషన్ పత్రాలు జారీ చేస్తామన్నారు. నామినేషన్ల దాఖలుకు 16 వరకు గడువని తెలియజేశారు. 18వ తేదీ రాత్రి 8గంటల లోగా ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. 25వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు, మరలా సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని, అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని తెలియజేశారు.

సీఎస్సీతో విజ్ఞాన్ ఒప్పందం

అగనంపూడి: భారత ప్రభుత్వ సంస్థ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సీఎస్సీ అకాడమీతో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల పరస్పర ఒప్పందం కుదుర్చుకుంది. ఎస్సీ, ఎస్టీ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సాంకేతిక నైపుణ్యాభివృద్ధిపై బెంగుళూరు, సీడీ ఏసీఐఐఈ సంస్థలు శిక్షణ ఇవ్వనున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. సీఎస్సీ అకాడమీ ప్రతినిధి వై.రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డీన్ బొడే ప్రసాద్ పాల్గొన్నారు.

బస్ స్టాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం బస్ స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గాజువాక పోలీసులు సోమవారం గుర్తించారు. స్థానికుల సమాచారం అందుకున్న గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 60 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహాన్ని గుర్తించిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

సత్యసాయి సేవా స్ఫూర్తే పరమావధి



మాట్లాడుతున్న సత్యసాయి కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ అరుణ్ పట్నాయక్

అగనంపూడి: సేవే పరమావధిగా సత్యసాయి సేవా సంస్థలు పని చేస్తున్నాయని సత్యసాయి కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ అరుణ్‌కుమార్ పట్నాయక్ అన్నారు. సత్యసాయి చూపిన సేవా మార్గమే జీవిత గమ్యమని భావించి, బాబా అనుచరులు ముందుకు వెళ్తున్నారన్నారు. అగనంపూడి సత్యసాయి భజన మండలి 17వ వార్షికోత్సవం సందర్భంగా అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవ చేయడంలో సత్యసాయి భక్తులు ఆనందాన్ని పొందుతారన్నారు. ఆ ఆనందానికి అవధులు ఉండవని, అందుకే స్వచ్ఛమైన సేవలకు నిజమైన రూపం సత్యసాయి భక్తులు అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు కె.ఎస్.ఎన్.రాజు, జి.రామకృష్ణ, విందుల పైడినాయుడు, ఎస్.కె.ఆర్.కె.రాజు, విందుల రామారావు, రామన్, విందుల వరహాలు, బాబూరావు, కృష్ణమూర్తి, సన్యాసిరాజు, గంగవరం గోపి పాల్గొన్నారు.

జెడ్సీ దృష్టికి అగనంపూడి సమస్యలు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని అగనంపూడి ప్రాంతంలో సమస్యలు పరిష్కరించాలని అగనంపూడికి చెందిన నాయకులు గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలంను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి అగనంపూడి జాతీయ రహదారి హనుమాన్ గుడి వరకు విద్యుద్దీకరణ చేపట్టాలని, అగనంపూడి ప్రాంతంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అగనంపూడి శ్మశాన వాటికలో కేర్‌టేకర్‌ను నియమించాలని కోరారు. సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకోవాలని, చెత్తను తరలించే వాహనాలు సరిపడా ఏర్పాటు చేయాలని, దువ్వాడ రైల్వేస్టేషన్ రాజీవ్‌నగర్ కనెక్టింగ్ రహదారిని విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్సీని కలిసిన వారిలో బి.సత్యనారాయణ, కె.అప్పారావు, బి.శ్రీనివాసరావు ఉన్నారు.

హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం



998వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి, నేడు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఇటువంటి ప్రభుత్వాల ఉనికి ప్రశ్నార్థకం కాక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 998వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, పేదప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేకుంటే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం ప్రాధాన్యం



వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



రోగులకు మందులు పంపిణీ చేస్తూ..

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- నెల్లిముక్కు పీహెచ్‌సీలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం పరిశీలన
- రోగులకు ఆత్మీయ పలకరింపు
- వైద్యపరీక్షల పరిశీలన.. మందుల పంపిణీ

పెదగంట్యాడ: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదనే సత్సంకల్పంతో మన సీఎం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీ కారం చుట్టారన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేరువలోనే అందించారని చెప్పారు. నెల్లిముక్కు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సోమవారం ఉదయం 10గంటలకు ఆయన ప్రారంభించారు. ముందుగా అక్కడ వేచి ఉన్న రోగు లను పరామర్శించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యసేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. దగ్గరుండి వారికి వైద్య పరీక్షలు చేయించారు.

504 మందికి వైద్యసేవలు

శిబిరంలో మొత్తం 504 మంది రోగులకు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కె.రమేష్‌బాబు, హేమలత, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కె.సంతోష్ రూప, దంతవైద్య నిపుణులు డాక్టర్ బి.మధు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎల్.పవన్ కుమార్, పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

రూ.17 కోట్లతో అగనంపూడి ఆస్పత్రి అభివృద్ధి

నియోజకవర్గ పరిధిలోని అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రిని రూ.17 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే నాగిరెడ్డి చెప్పారు. ఇక్కడున్న 50 పడకలను 100 పడకలుగా తీర్చిదిద్దామని, సేవలందించేందుకు 20 మంది సిబ్బందిని అదనంగా నియమించామని వివరించారు. ఆ ఆస్పత్రిలోనే అన్ని అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఇకపై ఇక్కడి నుంచి ఎవరినీ కేజీహెచ్‌కు రిఫర్ చేయకుండా ఇక్కడే చికిత్సలు చేసేలా రూపుదిద్దుతున్నామని తెలియజేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో 37 రోజులుగా ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా ఇంటింటికీ వైద్యాధికారులు వెళ్లి ఇంట్లో ఉన్న వారందరికీ వైద్య పరీక్షలు చేయించామన్నారు. అవసరమైన వారికి మందులు అందజేశామని తెలిపారు. దీని కోసం ఒక వ్యక్తికి రూ.12వేలు వంతున ఖర్చు చేశామన్నారు.

వైద్యాధికారులకు సత్కారం

అక్కడ సేవలందిస్తున్న వైద్యాధికారులతో పాటు స్పెషలిస్టులను పేరుపేరునా పలకరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజల నుంచి వస్తున్న స్పందన గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న వైద్య సేవలు, వారి స్పందిస్తున్న తీరు.. వారి ఆరోగ్య సమస్యలు తగ్గుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం 37 రోజులుగా నిరంతరాయంగా నిర్వహించిన శిబిరం ముగింపు సందర్భంగా సేవలందించిన వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌బాబు, హేమలతతో పాటు ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణను సత్కరించారు. వారికి సహకరించిన జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్‌లను సన్మానించారు.



వైద్యాధికారులకు సత్కారం

ఆరోగ్యం కుదుటపడుతుందనే ధైర్యం



అప్పలనర్సమ్మతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

వైద్యపరీక్షలు చేయించుకున్న అప్పలనర్సమ్మ అనే వృద్ధురాలితో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరోగ్యం బాగుందా? పరీక్షలు చేయించుకున్నావా అమ్మా. డాక్టర్లు బాగా చూశారా.. మందులు ఇచ్చారా అంటూ కుశలప్రశ్నలు వేశారు. దానిపై ఆమె సమాధానమిస్తూ డాక్టర్లు బాగా చూస్తున్నారని తెలిపింది. ఆరోగ్యం కుదుటపడుతుందనే ధైర్యం వచ్చిందని, జగన్‌బాబుకు రుణపడి ఉంటామని తెలియజేసింది.

మంచి మందులు ఇచ్చారు

ఇక్కడ సేవలు ఎలా అందుతున్నాయమ్మా అని వృద్ధురాలు వెంకటలక్ష్మిని ఎమ్మెల్యే ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ డాక్టర్లు మంచి మందులు ఇస్తున్నారని తెలిపారు. కాళ్లనొప్పులు ఉండడంతో కొద్ది రోజులుగా ఈ ఆస్పత్రిలో చూపించుకుంటున్నానని తెలియజేశారు. నడవలేకపోతున్నాని డాక్టర్లతో చెబితే మందులు ఇచ్చారని, నొప్పులు తగ్గుతున్నాయని, నడవగలుగుతున్నానంటూ సంతోషంగా చెప్పింది.



వెంకటలక్ష్మితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రయాణికుల కోసం స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్ – కటక్ – హైదరాబాద్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- హైదరాబాద్ – కటక్ (07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 7, 14, 21న (ప్రతీ మంగళవారం) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కటక్ – హైదరాబాద్ (07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 8, 15, 22న (ప్రతీ బుధవారం) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.
- ప్రయాణికుల సౌకర్యార్థం పూర్తి జనరల్ కోచ్‌లతో కూడిన ఎర్నాకుళం ధన్‌బాద్ (06077) స్పెషల్ రైలు ఈ నెల 10న రాత్రి 11.55 గంటలకు ఎర్నాకుళంలో బయల్దేరి ఆదివారం తెల్లవారుజామున 1.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.50 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ రైలు 22 జనరల్, 2 లగేజీ కం సెకండ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుంది.
- ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు – న్యూ భువనేశ్వర్ – బెంగళూరు మధ్య జన సాధారణ్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.
- బెంగళూర్ – న్యూ భువనేశ్వర్ (06287) స్పెషల్ ఈ నెల 10న బెంగళూరులో తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.38 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 10.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు న్యూ భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో న్యూ భువనేశ్వర్ – బెంగళూరు (06288) స్పెషల్ శనివారం ఉదయం 8.15 గంటలకు న్యూ భువనేశ్వర్‌లో బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.17 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం

తాటిచెట్లపాలెం: ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకువెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టపాసులు, గ్యాస్ సిలిండర్స్, ఏసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లలో, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావడం రైల్వే యాక్ట్ 1998 ప్రకారం నేరమని, ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. దీపావళి సమీపిస్తున్న తరుణంలో వాల్తేర్ డివిజన్ వీటికి సంబంధించి ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరితోపాటు సివిల్ డిఫెన్స్ సభ్యులు, టీటీఈలు, కోచ్ అటెండెంట్స్, ట్రెన్ మేనేజర్స్, స్టేషన్ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడతారన్నారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని త్రిపాఠి కోరారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్..

- బెంగళూరులో మంగళవారం ఉదయం 10.15 గంటలకు బయల్దేర వలసిన బెంగళూరు–అగర్తలా(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ 24 గంటలు ఆలస్యంగా బుధవారం ఉదయం 10.15 గంటలకు బయల్దేరుతుంది.
- అలెప్పిలో మంగళవారం ఉదయం 6 గంటలకు బయల్దేరాల్సిన అలెప్పి–ధన్‌బాద్ (13352) బొకారో ఎక్స్‌ప్రెస్ సుమారు 5 గంటలు ఆలస్యంగా ఉదయం 10.45 గంటలకు బయల్దేరుతుంది.

ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకం



కేక్ కట్ చేసి దేవన్‌రెడ్డికి తినిపిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర చరిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రతో ప్రజల కష్టాలు తెలుసుకున్న జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అమలు చేసి వారి కష్టాలను తీర్చారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల క్లస్టర్ అధ్యక్షుడు ధర్మాల శ్రీను, నాయకులు పాల్గొన్నారు.